క్లుప్తంగా

ఉచిత వైద్యశిబిరం



నారాయణపేట రూరల్ : పట్టణంలోని గీతా ఆస్పత్రి వైద్య బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరం విజయవంతమైందని డాక్టర్ గీతా తెలిపారు. స్త్రీ వైద్య నిపుణురాలు డాక్టర్ రాగసుధ హాజరై సంతాన సమస్యలతో సతమతమవుతున్న వారికి పరీక్షలు నిర్వహించారు. 80మంది మహిళలకు ఉచితంగా స్కానింగ్, రక్తపరీక్షలు చేపట్టి సూచనలు చేశారు. జీవనశైలి మార్చుకోవాలని, సరైన పోషక ఆహారం తీసుకోవాలని, హార్మోన్స్ సమతుల్యతను కాపాడుకోవాలన్నారు.

విద్యార్థికి సన్మానం



మద్దూరు: రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్ 17కబడ్డీ బాలుర విభాగంతో మహబూబ్‌నగర్ జిల్లా తరపున పాల్గొని రాష్ట్రస్థాయిలో బంగారు పతకం సాధించిన మద్దూరు బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి కిరణ్‌కు శుక్రవారం ఉపాధ్యాయులు శాలువాతో సన్మా నించారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చి పాఠశాలకు పేరు తీసుకొచ్చాడని హెచ్‌ఎం వెంకటరామిరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

రోడ్డు బాగు చేయరూ..



ఊట్కూరు: మండలంలోని బిజ్వార్ నుంచి పులిమామిడికి వెళ్లే బీటీరోడ్డు మరమ్మతులు చేపట్టాలని శుక్రవారం టీవీవీ జిల్లా సమన్వయ కర్త మహేష్‌గౌడ్ ఒక ప్రకటనలో కోరారు. బీటీరోడ్డుపై గుంతలు ఏర్పడడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరారు.

అయోధ్య రాముడి అక్షతల శోభాయాత్ర

నారాయణపేట రూరల్: అయోధ్య రామమందిరంలో పూజింపబడిన అక్షతల శోభాయాత్రను శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు వీహెచ్‌పీ నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని గొడుగుగేరి ఆంజనేయస్వామి ఆలయం నుంచి మేళతాళాలు, మహిళల హారతుల మధ్య ఉదయం 8గంటలకు ప్రారంభమవుతుందని, వార్డుల వారీగా విభజించి జనవరి 1నుంచి 15 వరకు ఇంటింటికీ పంపిణీ చేస్తామన్నారు.

దామరగిద్ద: ఆయోధ్య రామాలయ పునఃనిర్మాణం రాముడి ప్రతిష్ఠాపన ఉత్సవాల సందర్భంగా అయోధ్య రామ జన్మభూమి ట్రస్ట్ ద్వారా అందజేసిన అక్షతల పంపిణీ కార్యక్రమం శనివారం చేపడుతున్నట్లు నిర్వాహకులు రాఘవేందర్‌గౌడ్, సత్యనారాయణ రెడ్డి, హన్మంతు, మాణిక్ తెలిపారు. మండలంలోని క్యాతన్‌పల్లి వీరభద్రేశ్వరస్వామి వారి ఆలయంలో సాయంత్రం 3గంటల నుంచి పంపిణీ చేయనున్నారు. ప్రతి గ్రామం నుంచి విచ్చేసిన వారికి అక్షతలు, రాముడి కరపత్రాలు తీసుకెళ్లి రామమందిరంలో ఉంచి ఇంటింటికీ పంచాల్సి ఉంటుందన్నారు. గ్రామస్తులు అక్షతలను మహిళలు మంగళహారతులతో ఆహ్వానించాలని కోరారు.

గూడ్స్‌రైలు ఢీకొని నాలుగు ఎద్దులు మృతి

మరికల్: గూడ్స్‌రైలు ఢీకొని నాలుగు ఎద్దులు మృతి చెందిన ఘటన ఎలిగండ్ల శివారుల్లో శుక్రవారం చోటుచేసుకుంది. రైతులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని ఎలిగండ్లకు చెందిన బోయ చెన్నకేశవులుకు చెందిన రెండు ఎద్దులు, రామంజనేయులుకు చెందిన రెండు ఎద్దులు రైలు కట్ట వద్ద మేత మేస్తుండగా సాయంత్రం 5గంటల సమయంలో రాయిచూర్ నుంచి కాచిగూడాకు వెళ్తున్న గూడ్స్‌రైలు శబ్దానికి ఎద్దులు భయపడి రైలు పట్టాలపై పరుగులు పెడుతుండగా వెనక నుంచి రైలు ఢీకొనడంతో అక్కడిక్కడే ఎద్దులు మృతి చెందినట్లు బాధిత రైతులు తెలిపారు. ఒక్కొక్క జత ఎద్దులు రూ. లక్షకు పైగా ఉంటాయని బాధిత రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

బీసీ హాస్టల్ తనిఖీ

మక్తల్: పట్టణంలోని బీసీహాస్టల్‌ను బీసీ వెల్ఫేర్ అధికారి కృష్ణామాచారి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈమేరకు.. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో చదువుకోవాలని కోరారు. అనంతరం మరుగుదొడ్లు, వంటగదిని పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. ఆయనతోపాటు హాస్టల్ వార్డెన్ మాసూం తదితరులు ఉన్నారు.

అధ్వానంగా రోడ్డు

- ఇబ్బందుల్లో వాహనదారులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



చింతల్‌దిన్నే జాధరావుపల్లి రోడ్డు



కల్వర్టు తెగిపోయిన చింతల్‌దిన్నే జాధరావుపల్లి రోడ్డు

మద్దూరు: మండలంలోని జాధరావ్‌పల్లి నుంచి చింతల్‌దిన్నే వెళ్లే పంచాయతీ రాజ్ రోడ్డు అధ్వానంగా మారింది. పదేళ్ల క్రితం జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో మట్టి కొట్టించారు. అలాగే మెటల్ రోడ్డు కూడా వేశారు. ఇదే రోడ్డును పంచాయతీరాజ్ నిధుల నుంచి బీటీరోడ్డు వేయకపోవడంతో వాహనాలు తిరగడానికి వీల్లేకుండా పోయింది.

నడక దారికే పరిమితం..

చింతల్‌దిన్నె నుంచి జాధరావ్‌పల్లి వరకు ఉన్న 3.5 కిలో మీటర్ల రోడ్డును పదేళ్ల క్రితం ఉపాధిహామీ నిధులతో మెటల్ రోడ్డు వేశారు. అప్పటినుంచి ఇప్పటి వరకు ఈ రోడ్డు వంకా చూడకపోవడంతో అసలు ఈ రోడ్డు ఉందా అనే పరిస్థితి నెలకొంది. ద్విచక్రవాహనం కూడా రావడానికి వీల్లేకుండా మారింది. కొన్ని చొట్ల కల్వర్టు తెగిపోయాయి. మరికొన్ని చోట్లు కంపచెట్లు మొలిచాయి. దీంతో చింతల్‌దిన్నే మీదుగా జాధరావ్‌పల్లి తాండా, సీత్యానాయక్ తాండా, కోస్గి, నందిపాడ్ వెళ్లడానికి వీల్లేకుండా తయారైయింది. ఈ గ్రామాల ప్రజలు దొరేపల్లి మీదుగా మద్దూరు మండలానికి వస్తున్నారు. ఈ రోడ్డు బాగైతే మద్దూరు, కోస్గి వెళ్లడానికి నాలుగు గ్రామాల ప్రజలకు దూర భారం తగ్గుతుంది.

ఇబ్బందులు పడుతున్నాం



మా పొలాలన్ని జాధరావ్‌పల్లి వెళ్లే దారిలోనే ఉన్నాయి. ఈ రోడ్డు వెంబడి కనీసం ఎండ్ల బండి కూడా వెళ్లడానికి వీల్లేని విధంగా తయారైయింది. పొలాలకు వెళ్లడానికి, పంటను తీసుకురావడానికి చాలా ఇబ్బందులు పడుతున్నాం.

– కిష్టమ్మ, చింతల్‌దిన్నే

బీటీరోడ్డు వేయాలి..



ఈ రోడ్డు వల్ల కోస్గి, మద్దూరుకు వెళ్లడానికి నాలుగు గ్రామాల ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుంది. ప్రస్తుతం ద్విచక్రవాహనం కూడా వెళ్లడానికి వీల్లేకుండా రోడ్డు తయారైయింది. వెంటనే అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బీటీరోడ్డు ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– ఆంజనేయులు, చింతల్‌దిన్నే

పర్యావరణ పరిరక్షణకు నడుం బిగిద్దాం



జాజాపూర్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

నారాయణపేట రూరల్: విద్యార్థి దశనుంచే పర్యావరణ పరిరక్షణకు నడుంబిగించాలని డీఎస్‌ఓ భాను ప్రకాష్ అన్నారు. యంగ్ ఎర్త్ లీడర్స్ ప్రోగ్రాంలో భాగంగా స్కూల్ ఎడ్యుకేషన్, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ సంస్థ సంయుక్తంగా జిల్లాలో ఎంపిక చేసిన పది ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మండలంలోని జాజాపూర్, కొల్లంపల్లి పాఠశాలల్లో పర్యావరణ శాస్త్రవేత్త ఉమామహేశ్వర్‌రావు హాజరై పిల్లలకు పర్యవరణ పరిరక్షణ, కాలుష్యం నుంచి కాపాడుకునేందుకు అనుసరించాల్సిన విధానాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కాలుష్యానికి కారణాలను గుర్తుచేస్తూ వాటితో కలిగే దుష్ఫలితాలను వివరించారు. అరికట్టడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరుతూ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఎంగ్ లీడర్స్‌ను ఎంపిక చేసి వారికి బ్యాడ్జీలను అందించారు. కార్యక్రమంలో వెంకటేష్, వీరేషం, కృష్ణవేణి, మాణిక్యప్ప పాల్గొన్నారు.

నేడు అయ్యప్పపడిపూజ

ఊట్కూరు:మండలంలోని చెక్‌పోస్టు వద్ద అయ్యప్ప సన్నిధానంలో శనివారం అయ్యప్ప స్వామి మహాపడిపూజను నిర్వహిస్తున్నట్లు గురుస్వాములు భగవంతు, రఘువీర్, చంద్రకంటి శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాపూజ సందర్భంగా గ్రామంలో కలశ ఊరేగింపు, మహాపడిపూజ, అన్నదానం నిర్వహిస్తున్నా మని భక్తులు అధిక సంఖ్యలో రావాలని కోరారు.

కార్యకర్తను పరామర్శించిన ఎమ్మెల్యే



నారాయణపేట: ఊట్కూర్ సమీపంలో ఈ నెల 25న జరిగిన రోడ్డు ప్రమాదంలో నారాయణపేట మండలం బండగొండ కాంగ్రెస్ యువనాయకుడు రాఘవేందర్‌రెడ్డి గాయపడి హైదరాబాద్ గాంధీ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి శుక్రవారం బాధితుడిని ఆస్పత్రిలో పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి అన్నివిధాల ఆదుకుంటామని ఎమ్మెల్యే భరోసానిచ్చారు.

నేటితో ముగియనున్న లోక్ అదాలత్

నర్వ: నేటితో జిల్లా కోర్టు సముదాయంలో నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ ముగియనుందని ఎస్‌ఐ కురుమయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కక్షలు, తగాదాలకు వెళ్లకుండా రాజీ మార్గంలో పరిష్కరించుకునేందుకు లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. శనివారం నిర్వహించే కార్యక్రమంలో గత కొన్నేళ్లుగా రాజీపడ దగ్గ క్రిమినల్, సివిల్, భూతగాద, చిట్‌ఫండ్, రోడ్డు ప్రమాదాలు, వివాహ, కుటుంబ, తగాదాలతో పాటు ట్రాఫిక్ కేసులు, డ్రంక్ డ్రైవ్, మైనర్ కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. జీవితంలో వివిధ కేసులతో న్యాయస్థానాల చుట్టూ తిరుగుతూ డబ్బు, సమయం, వృథా చేసుకుంటు మనస్తాపంతో భయం భయంగా గడపడం కంటే సామరస్య ధోరణితో రాజీపడి పరిష్కరించుకోవాలన్నారు.

కొనసాగుతున్న ‘ ప్రజాపాలన’



మద్దూర్‌లో దరఖాస్తును స్వీకరిస్తున్న తహసీల్దార్

నారామణపేట రూరల్: ప్రజాపాలనలో భాగంగా రెండవరోజు దరఖాస్తుల స్వీకరణకు మంచి స్పందన వస్తుంది. శుక్రవారం మండలంలో ఐదు గ్రామాల్లో చేపట్టగా 2188దరఖాస్తులను అధికారులకు అందించారు. కోటకొండలో 680, తిర్మలాపూర్‌లో 373, జాజాపూర్‌లో 910, లింగంపల్లిలో 97, పిల్లిగుండ్లతండాలో 128 దరఖాస్తులు వచ్చాయి. ఆయా జీపీల్లో ఎంపీడీఓ వెంకటయ్య, తహసీల్దార్ రాణాప్రతాప్, వ్యవసాయశాఖ అధికారి శరత్‌చంద్ర పర్యవేక్షించారు.

మద్దూరు: మండలంలోని కొత్తపల్లి మండలాల పరిధిలోని దొరేపల్లి, హన్మనాయక్‌తాండా, నిడ్జింత, పల్లెగడ్డతాండా, పల్లెర్ల, రెనివట్ల గ్రామాల్లో శుక్రవారం దరఖాస్తులు స్వీకరించారు. నిడ్జింత, పల్లెగడ్డ తాండకు ప్రత్యేకాధికారి ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి వ్యవహరించారు. నిడ్జింత 695 దరఖాస్తులు, పల్లెగడ్డతాండాలో 196, పల్లెర్లలో ఏఈపీఆర్ ఆంజనేయరెడ్డి ప్రత్యేకాధికారిగా వ్యవహరించారు. మొత్తం 2,807 దరఖాస్తులు వచ్చాయని మండల ప్రత్యేకాధికారి, జెడ్పీసీఈఓ జ్యోతి తెలిపారు. జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నర్సింహ, సర్పంచ్ లావణ్య, ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఊట్కూరు: మండలంలో శుక్రవారం ఊట్కూరు, పులిమామిడి, కొల్లూరు, తిప్రాసిపల్లి, లక్ష్మీపల్లి గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు ప్రజల వద్ద ఆరు గ్యారంటీలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించారు. మండలంలోని డీఎస్పీ సత్యనారాయణ బందోబస్తును పరిశీలించారు. ప్రత్యేకాధికారి వీణావాణి, ఎంపీడీఓ రమేష్‌కుమార్, తహసీల్దార్ శివశ్రీనివాస్, వ్యవసాయాధికారి గణేష్‌రెడ్డి పాల్గొన్నారు.

మక్తల్: ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను అందరూ వినియోగించుకోవాలని కమిషనర్ బాల్‌రాం నాయక్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని మున్సిపాలిటీ 16వార్డులలో 1353 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. చైర్‌పర్సన్ పావనీ, వైస్ చైర్మన్ అఖిలరెడ్డి, కౌసల్య, అర్చన, కొండయ్య, సత్యనారాయణ, రాములు, శంశోద్దీన్ పాల్గొన్నారు.


నర్వ: ప్రజా పాలనలో భాగంగా రెండోరోజు మూడు గ్రామాల్లో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అంతకుముందు పెద్దకడ్మూర్‌లో ఉదయం తహసీల్దార్ మల్లారెడ్డి, ఎంపీడీఓ సుదర్శన్, దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించారు. ఈ దరఖాస్తులను నింపేందుకు గ్రామాల్లో ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు సహాయం అందించారు. డీఎల్‌పీఓ సుధాకర్‌రెడ్డి, ఎస్‌ఐ కురుమయ్య, రాజేష్‌కుమార్ పాల్గొన్నారు.

కృష్ణా: మండలంలోని హిందుపూర్, ముడుమాల్ గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన ప్రజాపాలన ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ముడుమాల్లో ఎంపీడీఓ యశోద, హిందుపూర్‌లో తహసీల్దార్ దయాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో దరఖాస్తులను స్వీకరించారు. అధికారులు మదన్‌మోహన్‌రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, చక్రపాణి, తిమ్మప్ప, నర్సింహారెడ్డి, రవి, సర్పంచ్ లక్ష్మినారాయణగౌడ్, పాల్గొన్నారు.

ధన్వాడ: ప్రజపాలనలో ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్‌రావు కోరారు. శుక్రవారం మండలంలోని కిష్టాపూర్, గోటూర్, చర్లపల్లి గ్రామాల్లో గ్రామసభ నిర్వహించి అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. డీఎస్‌ఓ సుధాకర్, తహసీల్దార్ సింధుజా, ఎంపీడీఓ విజయలక్ష్మి, ఎస్‌ఐ రమేష్ ఉన్నారు.

దామరగిద్ద: మండలంలోని శుక్రవారం కంసాన్‌పల్లి, బాపన్‌పల్లి, క్యాతన్‌పల్లి, మొగుల్‌మడ్క, దామరగిద్ద తండా, సుద్దబండతండా, గ్రామాల్లో దరఖాస్తులను స్వీరించారు. ఆయా గ్రామాల్లో మొత్తం 4851 దరఖాస్తులు అందినట్లు ప్రత్యేక అధికారి గోపాల్‌నాయక్ తెలిపారు.

దరఖాస్తుల కొరత లేకుండా చూడాలి..



దరఖాస్తులను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

నారాయణపేట: ప్రజాపాలనలో భాగంగా ఆరు గ్యారంటీల పథకాల అమలుకోసం ప్రజలకు దరఖాస్తు ఫారాలను ఎక్కువ మొత్తంలో అందుబాటులో ఉంచుకోవాలని అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిట్టల్ అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని ఆరో వార్డు బీసీ కాలనీ కమ్యూనిటీ హాల్లో కొనసాగుతున్న వార్డు సభను శుక్రవారం ఆయన పరిశీలించారు. కుటుంబాల సంఖ్యకు అనుగుణంగా దరఖాస్తు ఫారాలను పంపిణీ చేయాలని ఆయన మున్సిపల్ కమిషనర్ సునీతకు సూచించారు. రోజువారిగా ప్రజల నుంచి ఎన్ని దరఖాస్తులు వస్తున్నాయని అక్కడి వార్డు అధికారి, అంగన్వాడీ టీచర్లను అడిగి తెలుసుకున్నారు.

ఊట్కూరు/మాగనూర్: మండలంలో కొనసాగుతున్న ప్రజాపాలనను శుక్రవారం అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిట్టల్ పరిశీలించారు. మండలంలో కొనసాగుతున్న వివరాలను తహసీల్దార్ శివశ్రీనివాసులును అడిగి తెలుసుకున్నారు. ఆయనతోపాటు ఆర్ఐ వెంకటేష్, రాఘవేందర్ రెడ్డి, శ్రావణ్‌కుమార్ ఉన్నారు.

మాగనూర్ మండలంలోని శుక్రవారం వర్కూర్ గ్రామపంచాయతీలో ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి తీసుకోవాలనిఫారాలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

వినియోగించుకోవాలి..



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వాకిటి

మాగనూర్: ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రజాపాలనను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. శుక్రవారం మండలంలోని వర్కూర్, కొత్తపల్లి, ఉజ్జెల్లి గ్రామాల్లో నిర్వహించారు. ఈమేరకు.. వర్కూర్ 525, కొత్తపల్లి 621, ఉజ్జెల్లిలో 433 దరఖాస్తులను స్వీకరించినట్లు మండల ప్రత్యేక అధికారి కృష్ణాచారి తెలిపారు. అలాగే కొత్తపల్లి, వర్కూర్ గ్రామాల్లో జరిగిన ప్రజాపాలనను ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పరిశీలించారు.ఎంపీడీఓ శశికళ, తహసీల్దార్ సతీష్‌కుమార్, డీటీ అమీర్, వైస్ ఎంపీపీ తిప్పయ్య, ఎంపీఓ జైపాల్‌రెడ్డి, ఆర్ఐ శ్రీశైలం, సర్పంచ్‌లు తిమ్మప్ప, నిర్మలమ్మ, లక్ష్మమ్మ, ఆనంద్‌గౌడ్, వాకిటి శ్రీనివాసులు, శివరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత పుస్తకాల పంపిణీ



గీతా పుస్తకాలను అందిస్తున్న మహిపాల్‌రెడ్డి

నారాయణపేట రూరల్: హిందువుల పవిత్ర గ్రంథమైన భగవద్గీత పుస్తకాలను ఎస్పీ బాలు ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ గీతా పారాయణం చేపట్టాలని, మానవ జన్మకు సార్థకత లభిస్తుందన్నారు. ప్రతి వ్యక్తి సన్మార్గంలో నడిచేందుకు దోహదపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నాగురావునామాజీ, వైద్యులు న్యాయవాదులు, కళాకారులు గీతా, విశ్వనాథ్, గండెకార్తిక్ పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన జిల్లా ప్యానల్ టీం



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న సభ్యులు

ధన్వాడ: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం జిల్లా ప్యానల్ టీమ్ సందర్శించారు. ఉదయం ప్రార్థన సమయం నుంచి సాయంత్రం వరకు పాఠశాల రికార్డులు, ఉపాధ్యాయులు తరగతి గదులను ఉపాధ్యాయులు టీచింగ్‌ను పరిశీలించారు. అనంతరం సాయంత్రం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. రికార్డులు, ఉపాధ్యాయుల బోధన నైపుణ్యం చాలా బాగుందని అభినందించారు. డీఈఓ అబ్దుల్‌ఘని, జీసీడీఓ పద్మనళిని, హెచ్‌ఎం రమేష్‌శెట్టి పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏఎస్‌ఐ శ్రీదేవి

కృష్ణా: సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఏఎస్ఐ శ్రీదేవి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆట, పాటల ద్వారా అవగాహన కల్పించారు. బాలికలు, మహిళలను ఎవరైనా లైంగికంగా వేదింపులకు పాల్పడితే, ర్యాగింగ్ చేసిన వెంటనే ధైర్యంగా పోలీస్‌లకు సమాచారం అందిస్తే చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. టోల్‌ఫ్రీనెంబర్ 1930, 100కు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

అమరచింత: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని లబ్ధిపొందుతున్నారని వికాసత్ భారత్ సంకల్ప యాత్ర టీం సభ్యులు సామ్రాజ్యలక్ష్మి తెలిపారు. మండలంలోని ప్రియదర్శిని నందిమళ్ల ఎక్స్‌రోడ్ గ్రామంలో శుక్రవారం కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు జాతీయ ఉపాధి హామీ పథకం, వ్యవసాయ రంగంలో రైతులకు సబ్సిడీలపై యంత్రాలను అందిస్తుందన్నారు. వ్యాపారులకు బ్యాంకు నుంచి రుణాలు మంజూరు చేసి వ్యాపారభివృద్ధికి దోహద పడుతుందన్నారు. పోస్టాఫీస్‌ల ద్వారా ఆడపిల్లలకు సుర్కక్ష యోజన పథకం, బేటీ పడావో–బేటీ బచావో నినాదంతో బాలికల సంరక్షణకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కరోనా సమయంలో వాక్సిన్‌లను ప్రజలందరికీ ఉచితంగా అందించిన ఘనత కేంద్ర ప్రభుత్వానికే దక్కిందని పేర్కొన్నారు. అనంతరం వ్యవసాయ పొలంలో డ్రోన్ సహాయంతో మందుల పిచికారీ గురించి రైతులకు ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ రామలింగేశ్వరమ్మ, వైద్యాధికారి రూపశ్రీ, ఆరోగ్య కార్యకర్త భరత్, ఏఎస్‌ఎం నాగమణి తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను బడులకు పంపండి



సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది

ఆత్మకూర్: బడి మధ్యలో మానేసిన పిల్లలను పనులకు కాకుండా బడులకు పంపాలని.. తిరిగి పాఠశాలల్లో చేర్పిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని ఎంఈఓ భాస్కర్‌సింగ్ అన్నారు. శుక్రవారం ఆత్మకూర్ మండలంలోని గ్రామాల్లో బడిబయట పిల్లల సర్వే నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా సీఆర్పీ సౌమ్యరాణి ఇంటింటికీ వెళ్లి వివరాలను సేకరించారు. చదువు ప్రాముఖ్యతను వివరిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

సిబ్బందికి సౌకర్యాలు కరువు

అమరచింత: పట్టణంలోని ఆయా వార్డుల్లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కౌంటర్ల వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి కనీస వసతులు కల్పించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రతి కౌంటర్‌కు రోజుకు రూ.వెయ్యి చొప్పున ఖర్చు చేయాలని, వీటిలోనే టీ, టిఫిన్లు సిబ్బందికి సమకూర్చాలనే నియమం ఉన్నా పట్టించుకోవడం లేదు. కౌంటర్ల వద్ద తాగునీటిని అందుబాటులో ఉంచట్లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంలో మున్సిపల్ కమిషనర్ చొవర చూపి సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.

తక్కువ జీతం ఉన్న వారికి అవకాశమివ్వాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీ పథకాలకు సంబంధించి దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించిందని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అల్‌ఫైజ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు జహంగీర్‌బాబా, మహ్మద్ యాఖూబ్ తెలిపారు. శుక్రవారం స్థానిక సద్దల్‌గుండులోని సంస్థ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. కాగా తక్కువ జీతంతో జీవితం కొనసాగిస్తున్న ఉద్యోగులకు కూడా ఈ ఆరు గ్యారంటీ పథకాల్లో అవకాశం కల్పించాలని సీఎంకు వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో షేక్ మహమూద్, సోహైల్ ఖాన్, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

రేపు జిల్లా కబడ్డీ జట్టు ఎంపిక

మరికల్: జిల్లా జూనియర్ బాలికల, బాలుర కబడ్డీ జట్లను ఈ నెల 31 మండలంలోని బాలుర ఉన్నతపాఠశాల ఆవరణలో ఎంపిక చేయనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి తిరుపతిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కబడ్డీ టీంలు వచ్చేనెల 11నుంచి 14వరకు సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో నిర్వహిస్తున్న 49వ రాష్ట్రస్థాయి జూనియర్ కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనున్నట్లు తెలిపారు.